రాష్ట్రస్థాయి ఉర్దూ సాహితీ సమ్మేళనం

కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

దోమకొండ, ఫిబ్రవరి 10 : మండల కేంద్రంలోని గడీ కోటలో రాష్ట్రస్థాయి ఉర్దూ సాహితీ సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. గడీ కోట సంస్థానాదీశులు కామినేని అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ హాజరయ్యారు. ఉదయం 10.30 నుంచి సాయంత్ర 5.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగిందని గడీ కోట సీనియర్ మేనేజర్ బాబ్జి తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ, దోమకొండ మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, ఎంపీడీవో చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలి

మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

కామారెడ్డి, ఫిబ్రవరి 10 : దళిత మహిళపై దాడి చేసిన వారిని కఠిన శిక్షించాలని రాష్ట్ర ఎస్టీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి జిల్లాలో మూడు రోజుల క్రితం దళిత మహిళపై జరిగిన దాడి బాధాకరం, దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ ఘటనను అన్ని దళిత సంఘాలు ఖండిస్తున్నాయని అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించి బాధితురాలికి ఉపాధి కల్పించేలా ఎస్సీ, ఎస్టీ కమిషన్, అన్ని దళిత సంఘాలు అండగా ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నేనావత్ రామ్‌బాబు నాయక్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బాబు, తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమయ్య, బీఎస్పీ పార్టీ రాష్ట్ర నాయకుడు బాలరాజ్, ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలను ఒంటరిగా వదలకండి

బాన్సువాడ, ఫిబ్రవరి 10 : పిల్లలను ఒంటరిగా వదలకండని బాన్సువాడ పట్టణ ఎస్‌హెచ్‌వో కృష్ణ సూచించారు. బాన్సువాడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు చాక్లెట్ ఇతర తినుబండారాలు ఇస్తే తీసుకోవద్దని పిల్లలకు తల్లిదండ్రులు చెప్పాలని సూచించారు. తల్లిదండ్రులు భయపడొద్దని అన్నారు. ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే 'డయల్ 100' ఫోన్ చేయాలన్నారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే ప్రశ్నించాలని, పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పోచారం జన్మదిన వేడుకలు

- రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

బాన్సువాడ, ఫిబ్రవరి 10 : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పోచారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్, పోచారం అభిమానులు పోచారానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్‌ను తినిపించారు. అనంతరం కార్యాలయంలో లయన్స్ క్లబ్ బాన్సువాడ, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పోచారం ప్రారంభించారు. స్వగృహం వద్ద మొక్కను నాటారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ, ఆలయంలో పూజలు

బాన్సువాడ రూరల్/బాన్సువాడ టౌన్/నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 10 : రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని సోమేశ్వర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, లయన్స్ క్లబ్ కోశాధికారి వెంకటరమణ, గ్రామస్తులు మొగులయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలోని సంగమేశ్వర కాలనీలో ఉన్న దుర్గాభవాని ఆలయంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లి సాయిబాబా ఆలయంలో, బీర్కూర్ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూజలు చేసి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పోచారం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, వైస్ చైర్మన్ షేక్ జుబేర్, బీఆర్ఎస్ నాయకులు, పాత బాలకృష్ణ, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింహులు, మైనార్టీ ఫంక్షన్ హాల్ అధ్యక్షుడు వాహబ్, ఏజాస్, రాజు, కౌన్సిలర్లు, ఎంపీపీ విఠల్, మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, మిర్జాపూర్ విండో చైర్మన్ మారుతి, అధికారులు, వ్యాపారులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

బాన్సువాడలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

నెమ్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న నాయకులు

అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ

కొయ్యగుట్ట తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 10 : శశాంక్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని కొయ్యగుట్ట తండాలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరం రెండో రోజు కొనసాగింది. శనివారం తండాలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని వివరిస్తూ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ముజాహిద్, పంచాయతీ కార్యదర్శి రహీలాబేగం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాగరాజు, అధ్యాపకులు రాజ్‌కుమార్, పవన్, అమీర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీబీపేట్ ఎస్సైగా ప్రభాకర్

బీబీపేట్, ఫిబ్రవరి 10 : బీబీపేట్ ఎస్సైగా ప్రభాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. లింగంపేట్ పీస్‌లో ఎస్సైగా పనిచేసి బీబీపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన అనిల్ కామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై ప్రభాకర్ కోరారు. సిబ్బంది ప్రసాద్, ప్రభాకర్, ప్రవీణ్, రాజయ్య పాల్గొన్నారు.

'ఎలాంటి సమస్య ఉన్నా సత్వరమే పరిష్కరిస్తాం'

పాల్వంచలో ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేసిన బీజేపీ నాయకులు

మాచారెడ్డి, ఫిబ్రవరి 10 : గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా తమ ఫిర్యాదులను ఫిర్యాదు బాక్స్‌లో వేస్తే కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి వెంటనే పరిష్కరిస్తారని బీజేపీ సీనియర్ నాయకుడు బాల్‌రాజు అన్నారు. పాల్వంచ మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి శనివారం ఫిర్యాదుల పెట్టెను అమర్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడానికే ఎమ్మెల్యే ఈ నిర్ణయం తీసుకున్నారని, ఈ బాక్స్‌లను ఎమ్మెల్యే సమక్షంలో తీసి సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తారని అన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఎల్వోసీ అందజేత

భిక్కనూరు, ఫిబ్రవరి 10 : మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన సంపంగి శివ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. బీజేపీ జంగంపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు తిర్మల్‌కు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించడంతో రూ.లక్షా 50 వేల ఎల్వోసీని బాధిత కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రం, రాములు, రాము, రంజీత్, ప్రవీణ్, బాల్‌రెడ్డి, లింగం, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయునికి రజత పతకం

రజత పతకం అందుకుంటున్న ఉపాధ్యాయుడు ఏనుగు సతీశ్‌రెడ్డి

కామారెడ్డి, ఫిబ్రవరి 10 : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో శనివారం నిర్వహించిన 5వ జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా నిర్వహించిన 30 సంవత్సరాల విభాగం డిస్కస్ త్రోలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎల్లారెడ్డి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మత్తమాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఏనుగు సతీశ్‌రెడ్డి రజత పతకం సాధించారు. ఈ విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు, కామారెడ్డి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సదరం క్యాంపును ఏర్పాటు చేయాలి

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10 : సదరం క్యాంపులను మండలాల వారీగా ఏర్పాటు చేయాలని కామారెడ్డి విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సబ్ కమిటీ డైరెక్టర్ నర్సింహులు, స్వామి, రాజు, సాయిలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

మాట్లాడుతున్న ఎంపీపీ నర్సింగ్‌రావు

మాచారెడ్డి, ఫిబ్రవరి 10 : నిరుద్యోగ యువతి, యువకులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు అన్నారు. పాల్వంచ మండలంలోని ఎల్పుగొండ గ్రామంలోని వెల్మ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉచిత నైపుణ్యాభివృద్ధి, ఉపాధిపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యశోద ఫౌండేషన్, స్వర్ణభారతి కంపెనీ, జీఎంఆర్, టాటా స్టైవ్, నేషనల్ అకాడమీ, మిట్ట ఫౌండేషన్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సుమారు 300 మంది నిరుద్యోగులకు గాను 185 మంది స్కిల్ డెవలప్‌మెంట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, రామ్మోహన్, మధుసూదన్‌రావు, పూల్‌చంద్, శేఖర్, నారాయణ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

నిజాంసాగర్, ఫిబ్రవరి 10: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రత్యేకాధికారి యూనుస్ కోరారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వెల్గనూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల పథకం అమలులో భాగంగాఆధార్, గ్యాస్ వివరాలు, విద్యుత్ వివరాలను సేకరిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈనెల 14 వరకు కొనసాగనున్న పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మురికి కాలువలు, రహదారుల శుభ్రం, తాగునీటి లీకేజీలు, క్లోరినేషన్ పనులు కొనసాగుతాయని తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి గంగాసాగర్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' అమలుకు సహకరించాలి

నిజాంసాగర్, ఫిబ్రవరి 10: గృహ జ్యోతి పథకం అమలు కోసం లబ్ధిదారులు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి గంగాసాగర్ కోరారు. మండలంలోని వెల్గనూర్ గ్రామంలో శనివారం విద్యుత్ మీటర్లు, ఆధార్, ఫోన్ నంబర్లు, తెల్లరేషన్ కార్డుల వివరాలను సేకరించారు. ఉపాధి కూలీలు, ఇతర రత్రా పనుల కోసం ఎవరైనా అందుబాటులో లేకపోతే మీటరు పక్కన తమ ఆధార్, తెల్లరేషన్ కార్డు, ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని కోరారు.

గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి యూనుస్

కుసుమ సాగు.. లాభాలు బాగు

- డోంగ్లీ మండలంలో విరివిగా సాగు
- ఆసక్తి చూపుతున్న రైతన్నలు
- ఆరు వందల ఎకరాల్లో సాగవుతున్న పంట

డోంగ్లీ, ఫిబ్రవరి 10: యాసంగి సాగు పనుల్లో అన్నదాతలు బిజీబిజీగా మారారు. ఈసారి కురిసిన అకాల వర్షాలతో పంటల సాగులో ఇబ్బందులు పడిన రైతన్నలు డోంగ్లీ మండల పరిధిలో కొంతమంది తెల్ల కుసుమ పంటను సాగుచేస్తున్నారు. తెల్ల కుసుమలతో గ్రామాల్లో గానుగ పట్టించి ఆ నూనెను ఏడాదిపాటు వినియోగిస్తారు. దీనిపై పల్లె నుంచి పట్టణ ప్రాంత వాసుల వరకు ఆసక్తి చూపడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ పలుకుతోంది. రైతులు పండించిన తెల్ల కుసుమలను మార్కెట్‌లో కాకుండా రైతుల ఇంటి వద్ద నుంచి వినియోగదారులు తీసుకెళ్తుండడంతో ఆశించిన మేర ధర లభిస్తున్నది. ఈ పంట పెట్టుబడికి తక్కువ ఖర్చు ఉండడంతో పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

గతేడాది 900 ఎకరాల్లో సాగు

మండలంలో 2022-23లో తెల్ల కుసుమ పంటను తొమ్మిది వందల ఎకరాల్లో సాగు చేయగా.. ఈ సంవత్సరం 600 వందల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. అకాల వర్షాల కారణంగా పంట విస్తీర్ణం తగ్గినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. గతంలో రైతులకు వాతావరణం సహకరించడంతో సాగు విస్తీర్ణం పెరిగిందని చెబుతున్నారు.

వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు

రైతులు వ్యవసాయ శాఖ సూచనలు, సలహాలను పాటిస్తూ పంటలను సాగుచేస్తున్నారు. ఏ పంటలు ఎప్పుడు వేయాలి.. ఎరువులు రసాయన మందుల సమతుల్యత తదితర అంశాలపై అధికారులు ఎప్పటికప్పుడు దృష్టిసారించి రైతులు పంటలు పండించేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో పంటల అధిక దిగుబడుల సాధనలో వ్యవసాయశాఖ కీలక భూమిక పోషిస్తుంది.

అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం..

డోంగ్లీ మండలంలో రైతులు యాసంగి సీజన్‌లో తెల్ల కుసుమ సాగుకు మొగ్గు చూపారు. మండలంలో మొత్తం 600 ఎకరాల్లో ప్రస్తుతం తెల్ల కుసుమ పంట సాగవుతున్నది. గతేడాదితో పోల్చితే పంట సాగు విస్తీర్ణం తగ్గింది. రైతులకు వ్యవసాయశాఖ తరపున అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. పంటకు తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం.

-రాజు, మండల వ్యవసాయ అధికారి (డోంగ్లీ, మద్నూర్)

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 10: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీవో సూర్యకాంత్ సూచించారు. మండలంలోని బుర్గుపల్లి, సముందర్ తండాలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నర్సరీ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. మొక్కలకు ప్రతిరోజూ నీరందించాలని, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విఠల్, ఏపీవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిజాంసాగర్ నీటి విడుదల నిలిపివేత

నిజాంసాగర్, ఫిబ్రవరి10: నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగు చేస్తున్న యాసంగి పంటల కోసం ఈనెల ఒకటో తేదీన ప్రారంభించిన నాలుగో విడుత నీటి విడుదలను ఆదివారం ఉదయం నిలిపివేయనున్నట్లు నీటి పారుదల శాఖ అదికారులు శనివారం తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1405.00 అడుగుల (17.80టీఎంసీలు)కు గాను 1399.05 అడుగులు (10.35 టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నదని పేర్కొన్నారు. ఆయకట్టు పంటల సాగు కోసం మొత్తం ఆరు విడుతల్లో 11 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సిన లక్ష్యంతో నీటి విడుదలను ప్రారంభించారు. ఇప్పటి వరకు గడిచిన మూడు విడుతల్లో 4.40 టీఎంసీల నీటిని విడుదల చేయగా .. నాలుగో విడుత శనివారం సాయంత్రానికి 1.31 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రధాన కాలువ ద్వారా 1755 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆయకట్టు పంటలు గట్టెక్కేందుకు ఇంకా రెండు విడుతల్లో నీటిని విడుదల చేయనున్నారు.

పరిశుభ్రత లేకుంటే చర్యలు తప్పవు

పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 10 : గ్రామంలోని ప్రతి వీధిలో పరిశుభ్రత ఉండాలని, లేకుంటే బాధ్యులపై చర్యలు తప్పవని ఎల్లారెడ్డి తహసీల్దార్, లక్ష్మాపూర్ ప్రత్యేక అధికారి మహేందర్ స్పష్టం చేశారు. శనివారం ఆయన గ్రామంలోని పలు కాలనీలను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

14న అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10: ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 14న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పద్మ శ్రీకాంత్, చంద్రం స్వామి, కృష్ణారెడ్డి, రాజేంద్రనాథ్, శ్రీనివాస్‌స్వామి పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన జడ్పీటీసీ

రామారెడ్డి, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా విద్యాలయాన్ని స్థానిక జడ్పీటీసీ మోహన్‌రెడ్డి శనివారం సందర్శించారు. బాత్‌రూమ్‌లకు తలుపులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసర ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రత్యేకాధికారి సవితారెడ్డిని కోరారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఇన్‌చార్జి భాగ్యలక్ష్మికి సూచించారు.

కొమలంచలో పశువైద్య శిబిరం

నిజాంసాగర్, ఫిబ్రవరి 10: మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 252 ఆవులు, గేదెలకు గర్భకోశ నివారణ చికిత్స నిర్వహించారు. వైద్యులు యూనుస్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. ప్రతి గ్రామంలో శిబిరాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సిబ్బంది నారాయణ, శీను, రఘు, సిద్ధు తదితరులు ఉన్నారు.

రామారెడ్డి ఎస్సైగా విజయ్‌కొండ

రామారెడ్డి , ఫిబ్రవరి 10: రామారెడ్డి ఎస్సైగా విజయ్ కొండ శనివారం బాధ్యతలు చేపట్టారు. పిట్లం నుంచి రామారెడ్డికి బదిలీపైరాగా.. ఇక్కడి పనిచేసిన సుధాకర్‌ను కామారెడ్డికి అటాచ్ చేశారు. శాంతిభద్రత పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్సై విజయ్‌కొండ ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సైకు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

గాంధారి, ఫిబ్రవరి 10: మండలంలోని గౌరారం గ్రామంలో ఉన్న సాయిబాబా ఆలయ ఐదో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజయ్య, ముదెల్లి విండో చైర్మన్ సాయిరాం, ఎంపీటీసీలు గాజుల ఉమారాణి, తూము అంజయ్య, బొల్లారం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 10 : లింగంపేట మండలంలోని శెట్పల్లి గ్రామంలో జరిగిన హత్య కేసుకు సంబంధించి పర్కాల రాజు అలియాస్ జీవన్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. గతేడాది అక్టోబర్ 11న శెట్పల్లి గ్రామానికి చెందిన మద్దెల కమలమ్మ ఇంట్లో చోరీకి పాల్పడి, ఆమెను హత్య చేసినట్లు పేర్కొన్నారు. సీఐ రవీందర్ నాయక్, ఎస్సై చైతన్య కుమార్ శనివారం శెట్పల్లి క్రాస్ రోడ్డు వద్ద నిందితుడిని పట్టుకొన్నారని, అతడి నుంచి బంగారు గొలుసు, కమ్మలను స్వాధీనం చేసుకున్నారని వివరించారు. కేసు ఛేదించిన పోలీసు అధికారులను అభినందిస్తున్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హ్యాపి నైట్స్ బార్ & రెస్టారెంట్, గిరిరాజ్ కాలేజి ఎదురుగా దుబ్బ బైపాస్ రోడ్ నిజామాబాద్‌లో పనిచేయుటకు అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, కుక్, వేయిటర్, సెల్స్‌మెన్, బౌన్సర్, డిజే ఆపరేటర్ & డ్రైవర్ కావలెను. సెల్: 9440645449.
NTZ-5934

WANTED

★నిజామాబాద్‌లో పనిచేయుటకు LADY CARE TAKER కావలెను. భోజనం + వసతి సౌకర్యం + జీతం ఇవ్వబడును. సంప్రదించండి. ఫోన్ : 9154545433
NTZ-324515

ప్లాట్లు కొనబడును

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, రామోజీ, కోహెడ, సాగర్ పంపు, గుంతపల్లి, బాటసింగారం, తూప్రాన్‌పేట్, మల్కాపురం, పోచంపల్లిలో ప్లాట్లు కొనబడును. J.సుధాకర్ గౌడ్: 9948172307, 9390846522.
NT-313886

మద్యం (ఆల్కహాల్) మాన్పించబడును

★త్రాగుడు (ఆల్కహాల్) & సిగరెట్, గుట్కా మానండి, మాన్పించండి. త్రాగేవారికి తెలియకుండా ఆయుర్వేద మందుతో మాన్పించవచ్చు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు. కేంద్రీయ ఆయుర్వేద. ఫోన్: 9652899899.
NT-319957

COMMERCIAL FOR SALE

★సికింద్రాబాద్, S.D. రోడ్, స్వప్నలోక్-సూర్యకిరణ్ కాంప్లెక్స్, 500 Sft., ఆఫీస్/గోడౌన్, 5వ అంతస్తు, సపరేట్ బాత్‌రూమ్, లిఫ్ట్/పార్కింగ్ కలిగిన కమర్షియల్ స్పేస్ అమ్మకం కొరకు కలదు. సెల్: 9246242210.
NT-319436

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.